www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 18 ఫిబ్రవరి 2025
5
వైఎస్ఆర్



కచ్చితమైన సమాచారంతోనే పాఠశాలల అభివృద్ధి

ప్రజాశక్తి - కడప అర్బన్ : కచ్చితమైన సమాచారంతోనే పాఠశాలలు అభివృద్ధి చెందుతాయని డిఇఒ ఎం షంషుద్దీన్ పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న మండల విద్యాశాఖధికారులు, సమగ్రశిక్ష ఎంఆర్‌సి సిబ్బందిలో భాగమైన మండల ఎంఐఎస్ కో - ఆర్డినేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, అకౌంటెంట్లు, సి ఆర్ పి (సి ఆర్ ఎం టి) ల సహకారంతోనే యూ -డైస్ లో జిల్లాకు రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభించిందని తెలిపారు. సోమవారం ఎస్‌పిజి చర్చి హాలులో యుడైస్ లో పనిచేస్తున్న వారికి ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనిత్తిడి ఉన్నప్పటికి ఎంతో ఓర్పుతో తక్షణ సమాచారం ఎప్పుడు అడిగినా మండల విద్యాశాఖధికారులు పంపుతుండటం అభినంద నీయమన్నారు. అందరి సహకారంతో విద్యాశాఖలో జిల్లా దాదాపుగా అన్నింటా ముందు ఉందన్నారు. నమోదయ్యే ప్రతి పాఠశాల సమగ్ర సమాచారం తోనే పాఠశాలల సర్వతోముఖాభివృద్ధి సాధ్యమౌతుందని చెప్పారు. సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో - ఆర్డినేటర్ ఎ.నిత్యానంద రాజు పేర్కొన్నారు.

మైదుకూరులో ధర్నా చేస్తున్న అంగన్వాడీలు



కడపలో అంగన్వాడీలను ఉద్దేశించి మాట్లాడుతున్న రామమోహన్



కదం తొక్కిన అంగన్వాడీలు

రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు తమ కోర్కెల సాధన కోసం అంగన్వాడీలు కదం తొక్కారు. న్యాయమైన డిమాండ్లు తీర్చాలని ధర్నాలు చేశారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా సంబంధిత కార్యాలయాల ఎదుట ఆందోళన చేపట్టారు.

- వేతనాలు పెంచాలంటూ ఆందోళన
- రూ.26 వేలు వేతనం ఇవ్వాలి
- కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలి
- వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామమోహన్, నగర అధ్యక్షులు చంద్రారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో ఐసిడిఎస్ అర్బన్, రూరల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి 8 నెలలైనా వేతనాలు పెరగకపోవడం అన్యాయమని తెలిపారు. 42 రోజులు సమ్మె నిర్వహించారని గుర్తు చేశారు. ఇప్పటికైనా ఈ ప్రభుత్వం వెంటనే జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. గ్రాట్యూటీ అమలు చేయలేదని, గ్యాస్ ఇచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ వేధింపులతో వర్కర్స్ సతమతమవుతున్నారని చెప్పారు. ప్రమోషన్లు రాకపోవడం, యాప్‌ల వేదనలతో, ఇబ్బందులతో వర్కర్స్ ఆవేదనకు గురి అవుతున్నారని తెలిపారు. సమ్మె సందర్భంగా నెరవేరుస్తామన్న హామీలన్ని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉదయ్, రవి, నాగలక్ష్మి ,వినీల, వసుంధర, యశోద, అర్బన్, రూరల్ ప్రాజెక్టుల అంగన్వాడీలందరూ పాల్గొన్నారు.

ఇచ్చిన డబ్బులు వెనక్కి తీసుకోవడం సరికాదు



జమ్మలమడుగులో ఐసిడిఎస్ పీడీకి వినతి పత్రం అందజేస్తున్న అంగన్వాడీలు

జిల్లాలో అంగన్వాడి సెంటర్ల అవసరాల నిమిత్తం ఒక్కొక్క సెంటర్ కు రూ.3వేలు ప్రభుత్వం ఇచ్చిందని, ఆ డబ్బుతో ఐదు రకాల వస్తువులు కొనుగోలు చేసి ఇచ్చారని, ఇప్పుడు డబ్బు వెనక్కి తీసుకోవడం సరి కాదని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు మనోహర్ సిఐటియు, నగర అధ్యక్షులు చంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం జెసికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఒక్కొక్క సెంటర్లో ఒక అవసరం ఉంటుందని తెలిపారు. వాటికి భిన్నంగా కామన్‌గా సరఫరా చేసి అంగన్వాడీ వర్కర్లను ఇబ్బంది పెట్టడం సరి కాదని చెప్పారు. వీటి వల్ల అంగన్వాడీ వర్కర్లు తీవ్ర ఇబ్బందులు గురి అవుతున్నారని పేర్కొన్నారు. అడిగితే బెదిరించడం, మెమోలు ఇవ్వడం, విజిట్ల పేరుతో భయభ్రాంతులకు గురి చేయడం దుర్మార్గమని తెలిపారు. ఇప్పటికైనా ఇలాంటి అధికారుల పైన విచారణ జరిపించి బాధ్యులపై కఠినంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉదయ్, రవి పాల్గొన్నారు. **పులివెందుల రూరల్ :** పట్టణంలో మినీ సెక్రెటరీ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు ధర్నా నిర్వహించారు. అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని, గ్రాడ్యుటీ అమలు చేయాలని, మినీ అంగన్వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్ లుగా మారుస్తూ జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈనేపథ్యంలో వారు పులివెందుల ఆర్‌డిఒ చిన్నయ్యకు, సిడిపిఒ శ్రీలతకు పులివెందుల సిఐటియు అనుబంధం అంగన్వాడీ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఆర్‌డిఒ, ,సిడిపిఓ స్పందిస్తూ మీ సమస్యలను జిల్లా అధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు అనుబంధం అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ పులివెందుల యూనియన్ నాయకులు సలీమా, సుధా, స్వప్న, మమత, శ్రీలత, స్రవంతి, వెంగమ్మ, అపర్ణ, లావణ్య, సుజాత, భారతి, మాధవి, రిబిక, శాంతి, పుష్పమణి, రామంజనమ్మ పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు అంగన్వాడీలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కె.సత్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం ప్రొద్దుటూరు ఐసిడిఎస్ రూరల్ కార్యాలయం ఎదుట అంగన్వాడీ వర్కర్లు, సిఐటియు నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళన తీవ్రత చేస్తామని, మార్చి 10న చలో విజయవాడ కార్యక్రమం అంగన్వాడీలు నిర్వహిస్తారని తెలిపారు. ధర్నాకు మద్దతుగా జెవివి రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, డివైఎఫ్‌ఐ కార్యదర్శి విశ్వనాథ్, ఆటో యూనియన్ కార్యదర్శి శేఖర్, సిఐటియు కార్యదర్శి పి రాఘవ, అంగన్వాడీ యూనియన్ కార్యదర్శి సుబ్బలక్ష్మి, సునీత, నాగలక్ష్మి ,అధ్యక్షులు రాణి,రాజి, సువార్తమ్మ మద్దతు తెలిపారు. **చాపాడు(మైదుకూరు) :** అంగన్వాడీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు నాయకులు ధనలక్ష్మి పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా సోమవారం మైదుకూరు ప్రభుత్వ కార్యాలయ ఆవరణలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **జమ్మలమడుగు రూరల్ :** రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆఫీస్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలకు వేతనాలు పెంచి గ్రాట్యూటీ అమలు చేయాలని సిఐటియు అనుబంధం అంగనాడీవర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్ష , కార్యదర్శులు వి. భాగ్యమ్మ , కె. లక్ష్మీదేవి, సిఐటియు పట్టణ కార్యదర్శి విజయ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చినటువంటి హామీలను అమలు చేయాలని. రాష్ట్రంలో నెలకొన్న అంగన్వాడీ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు ఉపాధ్యక్షులు ఎ.వినయ్ కుమార్, సిఐటియు నాయకులు శేఖర్, నాగన్న, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు జ్యోతి, అలేఖ్య, హైమావతి ,ముంతాజ్ అపర్ణ, హసీనా, శ్రీదేవి, రమా, లక్ష్మి కళ, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



ప్రొద్దుటూరులో అంగన్వాడీల ధర్నాకు మద్దతిస్తున్న సిఐటియు నాయకులు



పులివెందులలో ఆర్‌డిఒకు వినతి పత్రం అందజేస్తున్న అంగన్వాడీలు



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలియజేస్తున్న జర్నలిస్టు సంఘాల ఐక్యవేదిక నాయకులు

జర్నలిస్టులపై దాడులను అరికట్టాలి

-జర్నలిస్టు సంఘాల ఐక్య వేదిక నాయకుల డిమాండ్

ప్రజాశక్తి - కడప అర్బన్

జర్నలిస్టులపై దాడులను అరికట్టాలని, పార్వతీపురం మన్యం జిల్లా మకువా మండల ప్రజాశక్తి విలేకరి రామారావుపై దాడి చేసిన టిడిపి మండల నాయకుడు వేణుగోపాల్ నాయుడును వెంటనే అరెస్టు చేయాలని జర్నలిస్టు సంఘాల ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ప్రజా పరిష్కారాల వేదికలో డిఆర్‌ఒ విశ్వేశ్వర నాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎపిడబ్ల్యుజె జిల్లా అధ్యక్షులు రామ సుబ్బారెడ్డి, వీడియో అండ్ ఫొటో జర్నలిస్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షులు చెరుకూరి శ్రీనివాసులు, ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్ర మోహన్‌రాజు, మన్నూరు నూరుబాషా, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా గౌరవాధ్యక్షులు భూమిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెంటనే స్పందించి దాడి చేసిన వేణుగోపాల్ నాయుడుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో భాగంగా రోడ్డు పనుల దగ్గరికి వెళ్లిన విలేకరిని దుర్భాషలాడి చేయి చేసుకోవడం దారుణమని పేర్కొన్నారు. చంపుతానని, భార్యా బిడలకు దూరమవుతావని బెదిరించడం సమంజసం కాదని చెప్పారు. 'మిగిలినవారు మౌనంగా ఉంటే నువ్వు ఎవడివిరా రాస్తావు' అంటూ పూనకం వచ్చిన తరహాలో రెచ్చిపోవడం అందరూ గమనించారని తెలిపారు. అసాంఘిక, అనాగరిక శక్తులను అదుపులోకి తీసుకుని పత్రికా స్వేచ్ఛను కాపాడాలని కోరారు. విలేకరి ప్రాణానికి భద్రత కల్పించడంతోపాటు దాడి ఘటనకు సంబంధించి న్యాయం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జర్నలిస్టు సంఘాల నాయకులు రామానుజులరెడ్డి, శ్రీనివాసులు, సిద్దయ్య, నారాయణ, రాఘవులు, దుర్గాప్రసాద్, సుదర్శన్, ప్రభాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, నితిన్, సత్యం, ఎలక్ట్రానిక్ మీడియా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉమామహేశ్వరి, కెమెరామెన్లు, ఫొటోగ్రాఫర్లు, వివిధ పత్రికల ప్రతినిధులు, పాత్రికేయులు పాల్గొన్నారు.

వేంపల్లె : విధి నిర్వహణలో వార్తల కోసం వెళ్లిన పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన ప్రజాశక్తి విలేకరి రామారావుపై దాడి చేసిన టిడిపి నేత వేణుగోపాల్ నాయుడును పోలీసులు అరెస్టు చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కో- ఆర్డినేటర్ రహంతుల్లా పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో జర్నలిస్టులపై దాడులు ఎక్కువ అయినట్లు చెప్పారు. వేణుగోపాల్ నాయుడును సిఎం చంద్ర బాబు నాయుడు పార్టీ నుంచి సస్పెండ్ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. దాడులు చేసి ప్రభుత్వానికి, పార్టీకి చెడ్డపేరు తెచ్చే ఇలాంటి నాయకులను పార్టీలో ఉంచుకోవడం దారుణమని అన్నారు. అసాంఘిక, అనాగరిక శక్తులను అదుపులోకి తీసుకుని పత్రికా స్వేచ్ఛను కాపాడాల్సిన బాధ్యత సిఎం పై ఉందన్నారు. జర్నలిస్టులపై దాడులు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. జర్నలిస్టుల భద్రతపై కూడ ప్రభుత్వం దృష్టి పెట్టాలని కోరారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - కడప

విద్యుత్ ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. విద్యుత్ ప్రమాదాలు అరికట్టేందుకు రూపొందించిన వాల్‌పోస్టర్లు, కరపత్రాలను సోమవారం కలెక్టరేట్ సభా భవన్‌లో ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదాలను అరికట్టేందుకు ప్రజలలో అవగాహన కల్పించేందుకు వీడియో, ఆడియో, వాల్‌పోస్టర్లు, కరపత్రాలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. కేబుల్ నెట్వర్క్, టీవీలు, ప్రొజెక్టర్ల ద్వారా విద్యుత్ భద్రత నియమాల ప్రదర్శించడం వల్ల ఆకర్షణీయంగా అర్థం చేసుకోవచ్చన్నారు. ప్రతి ఇంటికీ విధిగా ఎర్తింగ్, ప్రమాణాలు కల్గిన పరికరాలు ఉపయోగించుకోవాలన్నారు. ముఖ్యంగా వ్యవసాయ బోర్ల వద్ద భద్రత నియమాలు మరింత విధిగా పాటించాలని పేర్కొన్నారు. అతుకులు లేని వైర్లను ఉపయోగించాలని తెలియజేశారు. అధిక శాతం విద్యుత్ ప్రమాదాలు నిర్లక్ష్యంతోనే సంభవిస్తున్నాయి, కావున ఒక్క క్షణం ఆలోచించి విద్యుత్ భద్రతా నియమాలు విధిగా పాటించి విలువైన ప్రాణాన్ని కాపాడుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెసి అదితిసింగ్, డిఆర్‌ఒ విశ్వేశ్వర నాయుడు, జడ్‌పి సిఇఒ ఓబులమ్మ, విద్యుత్ ఎస్‌ఇ ఎస్. రమణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మధుసూదన్, ఎపిటిఎస్ ఎస్‌ఐఎస్‌లు మధుసూదన్ రెడ్డి, హుస్సేన్ బాషా, అసిస్టెంట్ ఇంజనీర్ నీరజ, శ్రీధర్ పాల్గొన్నారు.

సమావేశానికి రాకపోతే సహించేది లేదు : ఎంపిడిఒ

ప్రజాశక్తి-కాశినాయన



మాట్లాడుతున్న ఎంపిడిఒ మైథిలీ

మండల సర్వసభ్య సాధన సమావేశానికి ఏ ఒక్క అధికారి రాకపోయినా వారిని క్షమించే ప్రసక్తే లేదని ఎంపిడిఒ మైథిలి పేర్కొన్నారు. సోమవారం మండలానికి సంబంధించి సర్వసభ్య సమావేశం ఎంపిపి పోలమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పోలమ్మ మాట్లాడుతూ అధికారులంతా గ్రామాల అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని కోరారు. అనంతరం ఎంపిడిఒ మైథిలీ మాట్లాడుతూ మూడు నెలలకు ఒకసారి మండల సమావేశం జరిగితే అప్పుడు కూడా అధికారులు హాజరై, వారి సమాచారం తెలపడానికి ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో అర్థం కావడం లేదని వాపోయారు. ఈ విధంగా అయితే ప్రతినెల మండల సమావేశం ఉంటుందని, అప్పుడు అధికారులు ఎంతవరకు హాజరవుతారో తెలుస్తుందని పేర్కొన్నారు. ఇక ముందు మండల సమావేశాలకు ఎవరైనా హాజరు కాకపోతే జిల్లా అధికారులకు నివేదిక పంపిస్తానని హెచ్చరించారు. ఈ సందర్భంగా అధికారులు వారి వారి నివేదికను చదివి వినిపించారు. కార్యక్రమంలో తహశీల్దార్ వెంకటసుబ్బయ్య, మండల ఉపాధ్యక్షులు వెంకట సుబ్బయ్య ఆచారి, నరసాపురం ఎంపిటిసి గౌసియా, ఎంపిటిసిలు, సర్పంచులు పిచ్చిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, తిరుపతి, బాల గురయ్యా, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

డిజిటల్ లావాదేవీలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి -చెన్నూరు : డిజిటల్ లావాదేవీల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకొని అనునిత్యం అప్రమత్తంగా ఉండాలని ఎపిఎం ఎం. వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సోమవారం కొండపేట గ్రామంలో ఆర్థిక నేరాలపై పొదుపు సంఘాల మహిళలకు భారతీయ రిజర్వుబ్యాంకు సహకారంతో హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ రూర్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిఎం మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన నేపథ్యంలో ఆర్థిక నేరాలు ఎక్కువ అవుతున్నాయని పేర్కొన్నారు. సైబర్ నేరాలు జరిగిన తక్షణమే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. స్థానిక సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాల్సి ఉంటుందని తెలియజేశారు. కెనరా బ్యాంక్ ఎఫ్‌ఎల్‌సి వీరప్రసాద్ మాట్లాడుతూ అపరిచిత ఫోన్ కాల్స్ పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని, ఒటిపిలను, వ్యక్తిగత సమాచారాన్ని షేర్ చేయరాదని వివరించారు. డిజిటల్ అరెస్టు, వాట్సాప్ లింకులు, చిన్న పిల్లలు గేమ్ లాడుట, ఇటువంటి అన్ని విషయాలపైన జాగ్రత్తగా ఉండి సైబర్ నేరాలు అరికట్టాలని సూచించారు . కెనరా బ్యాంక్ రిటైర్డ్ మేనేజర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఆర్థిక నేరాల పట్ల సైబర్ క్రైమ్ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉన్నప్పుడే వీటిని అరికట్టగలమని తెలిపారు. తెలియని వ్యక్తులతో వ్యక్తిగత సమాచారాలు, వాట్సాప్ ద్వారా తెలియచేయకూడదనర్నారు. వెలుగు సి.సి.శంకర్‌రెడ్డి మాట్లాడుతూ డిజిటల్ లావాదేవీలు, ఎటిఎం పైన ఉన్న నంబర్లు, ఒటిపి నంబర్లు, పిన్ నంబర్లు ఇతరులకు తెలియజేయరాదని చెప్పారు. మన డబ్బు సైబర్ మోసాల ద్వారా పోయిన వెంటనే 48 గంటల లోపల ఫిర్యాదు చేసిన ఎడల తిరిగి వచ్చే అవకాశాలు ఉంటాయని చెప్పారు. అనంతరం కళాజాతా బృందం కె.ఎస్. రూరల్ మీడియా ప్రతినిధులు చక్కగా మహిళా సంఘాలకు అవగాహన కల్పించారు.

మెరుగైన సేవలందించండి : ఎస్‌పి

ప్రజాశక్తి-కడప అర్బన్ : హోంగార్డులు విధుల్లో వృత్తి నైపుణ్యం పెంపొందించుకుని ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలని ఎస్‌పి ఇ.జి అశోక్ కుమార్ సూచించారు. జిల్లాలోని హోం గార్డు సిబ్బందికి రెండు వారాల పాటు నిర్వహించే మొబలైజేషన్ కార్యక్రమాన్ని సోమవారం స్థానిక పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోంగార్డ్ విధుల్లో చేరేముందు శిక్షణలో నేర్చుకున్న తర్ఫీదు అంశాలను మరోసారి గుర్తు చేసుకుంటూ మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దుకునేందుకు కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. తక్కువ సమయంలో ఎక్కువ ఫలితాలిచ్చే విధంగా సామర్థ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. మొబిలైజేషన్‌లో ట్రాఫిక్ రెగ్యులేషన్, పర్సనాలిటీ డెవలప్ మెంట్, ఫిజికల్ ఫిట్ నెస్, మాబ్ కంట్రోల్, బందోబస్తు విధులు, డ్రిల్ అంశాల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. హోమ్ గార్డు సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. క్రమం తప్పకుండా యోగా, ధ్యానం, వ్యాయామం చేయడం ద్వారా మానసిక, శారీరక ఆరోగ్యం దృఢం అవుతుందన్నారు. మొబిలైజేషన్‌లో భాగంగా సిబ్బంది సంక్షేమానికి వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొబిలైజేషన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి (అడ్మిన్) కె.ప్రకాష్ బాబు, అదనపు ఎస్‌పి (ఎఆర్) బి.రమణయ్య, ఎఆర్‌డిఎస్‌పి కె.శ్రీనివాసరావు, ఆర్‌ఐలు శ్రీశైల రెడ్డి, ఆనంద్, వీరేష్, ఆర్‌ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, హోమ్‌గార్డులు పాల్గొన్నారు.

మైనార్టీలకు అండగా ఉంటాం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కడప అర్బన్ : మైనార్టీ ఉద్యోగులందరికీ తమ ప్రభుత్వం అండగా ఉందని ఎమ్మెల్యే మాధవి పేర్కొన్నారు. అల్ మేవా 2025 డైరీని కడప ఎమ్మెల్యేతోపాటు, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్. శ్రీనివాస రెడ్డి, అల్ మేవా రాష్ట్ర గౌరవ అధ్యక్షులు డాక్టర్ ఎస్‌ఎఎస్ ఫరూక్ చేతుల మీదుగా జిల్లా అధ్యక్షుడు పి.ఎం. జలీల్ ఖాన్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రానున్న పవిత్ర రంజాన్ మాసంలో మైనార్టీ ఉద్యోగుల కోసం కార్యాలయాల నుంచి ఒక గంట ముందు వెళ్లడానికి ప్రభుత్వం అనుమతించిందని చెప్పారు. ఉర్దూ పాఠశాలలను మూసివేస్తున్నట్టు చేస్తున్న ప్రచారంలో ఏ మాత్రం నిజం లేదని, అది ప్రతిపక్షాలు చేస్తున్న కుట్ర అన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు లయన్ మన్సూర్ అలీ ఖాన్, కార్పొరేటర్ జప్రుల్లా, అల్ మేవా రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి పి.సన్నావుల్లా, జిల్లా ప్రధాన కార్యదర్శి నజీర్ బాష, రాష్ట్ర నాయకులు హబీబుల్లా, ఫక్రుద్దీన్, ఖాజా మైనుద్దీన్, మహబూబ్ బాషా హుస్సేన్, గౌస్ పీర్, హైదర్ వలి, ఈజాజ్, ఇలియాస్, మౌలాలి పాల్గొన్నారు.



డైరీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మాధవి, శ్రీనివాసరెడ్డి

ఘనంగా భారతరత్న కర్పూరి ఠాగూర్ వర్ధంతి

ప్రజాశక్తి - కడప అర్బన్

జన నాయక్ కర్పూరి ఠాగూర్ ఫౌండేషన్ కడప జిల్లా ఆధ్వర్యంలో సోమవారం బిసి భవన్‌లో కర్పూరి ఠాగూర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఫౌండేషన్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ డి.పి.వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి ఎం. శ్రీనివాసులు ఆధ్వర్యంలో కర్పూరీ ఠాగూర్ చిత్రపటానికి పూలమాలతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ కర్పూరి ఠాగూర్ జీవితం ప్రతి ఒక్కరు తెలుసుకుని ఆయన మార్గంలో వెళ్లగలిగినప్పుడు బడుగు, బలహీన వర్గాల వారికి మేలు చేకూరుతుందని వక్తలు అభిప్రాయపడ్డారు. ఠాగూర్ బీహార్‌లో అతి సామాన్య నాయి బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారని పేర్కొన్నారు. చదువుకునే రోజుల్లో సామాజిక స్పృహ కల్గిన ఠాగూర్ పేద, బడుగు, బలహీన, అణగారిన వర్గాలకు అనిచివేతకు గురవుతున్న వారికి అండదండగా నిలిచారని తెలిపారు. కార్యక్రమంలో నెల్లూరు అధ్యక్షులు కుమార్, అవ్వరు మల్లికార్జున, పి.వి.రమణ, నబి కోట శ్రీనివాసులు, మునుస్వామి, ద్వారక రామస్వామి, వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత కంటి అద్దాలు పంపిణీ

ప్రజాశక్తి - కడప అర్బన్: పెండ్లిమర్రి మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కస్తూర్బ ప్రభుత్వ బాలికల విద్యార్థులకు నోడల్ ఆఫీర్ రవికుమార్ ఆధ్వర్యంలో కంటి అద్దాలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా కడప డిఎస్‌పి వెంకటేశ్వర్లు, ఎంఐ మధుసూదన్‌రెడ్డి, వైద్యదికారి డాక్టర్ సమీరా భాను హాజరై కంటి అద్దాలనుఅందజేశారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ పిల్లలు సెల్ ఫోన్ వాడకం, గుడ్ టచ్ -బ్యాడ్ టచ్ గురించి అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. డాక్టర్ సమీరా భాను మాట్లాడుతూ దృష్టి లోపం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహార పదార్థాల గురించి వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మోహన్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు, రేపు అంతర్జాతీయ సదస్సు

ప్రజాశక్తి-కడప అర్బన్ : యోగివేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో 18,19 తేదీలలో 'తెలుగులో రామాయణాలు - సామాజిక దృక్పథం' అనే అంశంపై అంతర్జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి యోగి వేమన విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జ్ విసి ఆచార్య కె.కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. ప్రాచీన విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ సభాధ్యక్షులుగా వ్యవహరిస్తారని, ఆచార్య కె.మలయవాసిని కీలకోపన్యాసకురాలుగా, స్వామి అనుపమానంద గౌరవ అతిథిగా, స్వామి తురీయానంద ఆత్మీయ అతిథిగా హాజరవుతారని తెలిపారు. సదస్సుల్లో దేశ, విదేశాలకు సంబంధించిన ప్రతినిధులు, సాహితీవేత్తలు 60 మంది పరిశోధనా పత్రాలు సమర్పణ చేస్తారని పేర్కొన్నారు. విదేశీల ప్రతినిధులు, పత్ర సమర్పకులు ఆన్లైన్ ద్వారా కూడా పాల్గొంటారని తెలిపారు.

ప్రాథమిక పాఠశాలల తరలింపును మానుకోవాలి : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్

పోరుమామిళ్ల మండలంలోని ఇందిరానగర్ గ్రామానికి చెందిన ఎంపిపిఎస్ ప్రాథమిక పాఠశాలలోని 3,4,5 తరగతులు చదువుతున్న విద్యార్థులను వేరే పాఠశాలకు తరలించే ఆలోచన మానుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి అన్నారు. అనంతరం సోమవారం కడప నగరంలోని డిఇఒ కార్యాలయంలో ఎడి మునీర్ ఖాన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ కొన్ని ఏళ్లుగా పాఠశాలలో సొంత ఊరులోనే ఉంటూ ఎంతోమంది విద్యార్థులు ప్రాథమిక పాఠశాలలో విద్యను అభ్యసించిపై చదువుల కోసం వెళ్లారని తెలిపారు. ఇటీవల జిఒ నంబర్ 117 విధానాన్ని దొడ్డి దారిలో తెచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని పేర్కొన్నారు. మండ లంలోని ఇందిరానగర్ పాఠశాలను 3,4,5 తరగతుల విద్యార్థులను కొత్రపాటిపల్లి గ్రామానికి పాఠశాలకు తరలించే విధానాన్ని మానుకోవాలని హితవు పలికారు. జిల్లాలోని 8 ప్రాథమిక పాఠశా లలు తరలించే విధానాన్ని ఉపసం హరించు కోవాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలలను తరలిస్తే విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు పోరాటానికి సిద్ధమవుతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నగర అధ్యక్షులు జాలా సుమంత్, నాయకులు ఉదయ్ పాల్గొన్నారు.

రేపు మంచినీటి సరఫరా బంద్

ప్రజాశక్తి- కడప అర్బన్ : నగర పాలక సంస్థకు నీటి సరఫరా చేసే లింగంపల్లి నీటి పంప్ హౌస్‌లో ఈనెల 19న ఎపి ఎస్‌పిడిసిఎల్ వారు విద్యుత్ మరమ్మతు పనులు నిర్వహించనున్న నేపథ్యంలో లింగంపల్లిలో విద్యుత్ సరఫరా ఉండదని, దీంతో కడప నగర పాలక సంస్థకు నీటి సరఫరా బంద్ చేస్తున్నట్లు కమిషనర్ మనోజ్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాయి పేట , బెల్లం మండి, మాసాపేట, అక్కయపల్లి, చెమ్మూ మియాపేట, విజయదుర్గా కాలనీ, లోహియ నగర్ ప్రాంతాలకు మంచినీటి సరఫరా నిలిపేస్తామన్నారు. ప్రజలందరూ గమనించి, నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని తెలిపారు.

బలిజ సామాజిక వర్గాన్ని అవమానించడం తగదు

ప్రజాశక్తి - కడప

బలిజ సామాజిక వర్గాన్ని కడప ఎమ్మెల్యే మాధవి, టిడిపి పోలీస్ బ్యూరో సభ్యులు, జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి టార్గెట్ చేసి అవమానిస్తున్నారని, ఇది సరైంది కాదని వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు దాసరి శివప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ తోట కృష్ణ, వైసిపి నాయకులు అన్నారు. వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సోమవారం మాజీ ఉప ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలఃయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కడప నియోజ కవర్గ ఎమ్మెల్యే మాధవి స్థానికంగా ఊర్లో ఉన్నప్పటికీ శ్రీకృష్ణదేవరాయలు విగ్రహానికి పూల ధారణ చేయకపోవడం దారుణం అన్నారు. సమావేశంలో మాజీ కౌన్సిలర్ కో- ఆప్షన్ సభ్యులు ఉమాదేవి, 9వ డివిజన్ ఇన్‌ఛార్జి మల్లికార్జున, కిరణ్, నగర యువ జన విభాగం అధ్యక్షుడు గుంటి నాగేంద్ర, సుదర్శన్ రాయల్, రామకృష్ణ, మల్లీశ్వరి పాల్గొన్నారు.

ఫిక్స్‌డ్ డిపాజిట్‌లపై అవగాహన

ప్రజాశక్తి - కడప

కెనరా బ్యాంక్ రీజనల్ హెడ్ కె. మురళీమోహన్ ఆదేశాల మేరకు సోమవారం ఫిక్స్‌డ్ డిపాజిట్‌లపై, కెనరా ఏంజెల్ అకౌంట్స్‌పై కడప నగరంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజల సద్వినియోగం చేసుకొని లబ్ది పొందాలని కోరారు. కార్యక్రమంలో డిఎం విలియం కుమార్, సిహెచ్ వెంకట పూర్ణ, షఫీక్ అహ్మద్, పి. శివ లలిత, మధుకర్, వీరచంద్ర, మిశ్రా, పెరుమాళ్, సిబ్బంది పాల్గొన్నారు.



ఫిక్స్‌డ్ డిపాజిట్‌పై అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు



పనులు జరగకుండా బైఠాయించిన రైతులు

నష్టపరిహారం కోసం రైతులు బైఠాయింపు

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

బెంగళూరు-విజయవాడ మీదుగా వెళ్లే గ్రీన్‌ఫీల్డ్ హైవేకు మండలంలోని లింగాలదిన్నెపల్లి, మల్లేపల్లి, శ్రీరామ నగర్, ఎద్దులయపల్లి, ముడమాల గ్రామాల రైతులకు నష్టపరిహారం అందకపోవడంతో సోమవారం వారు ఆ పనులను అడ్డుకున్నారు. రెండేళ్ల నుంచి పనులు జరుగుతున్నప్పటికీ నష్టపరిహారం అందకపోవడంతో రైతులు రోడ్డుపై బైఠాయించారు. తమ వద్ద ఉన్న భూ డాక్యుమెంట్లు అధికారులకు పలుమార్లు అందజేసినా వారు పట్టించుకోవడం లేదంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు రూ.10కోట్ల నష్టపరిహారం అందవలసి ఉందన్నారు. పులివెందుల నియోజకవర్గంలో ఎకరాకు రూ.30, రూ.40 లక్షల నష్టపరిహారం అందిస్తున్నారని తెలిపారు. ఇక్కడ తమకు మాత్రం కేవలం రూ.10 లక్షలు మాత్రమే నష్టపరిహారం ఇవ్వడం బాధాకరమన్నారు. నష్టపరిహారం పెంచకపోతే రోడ్డు పనులను అడ్డుకుంటామని వారు హెచ్చరించారు.



విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఇర్ఫాన్ బాషా

సబ్‌స్టేషన్ పనులను తక్షణం ఆపేయాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు శ్రీనివాస నగర్‌లో ఇళ్ల మధ్య నిర్మిస్తున్న సబ్‌స్టేషన్ పనులను అధికారులు తక్షణం ఆపేయాలని కాంగ్రెస్ పార్టీ ప్రొద్దుటూరు ఇన్‌ఛార్జి ఇర్ఫాన్ బాషా పేర్కొన్నారు. ఆ మేరకు సోమవారం ఆ ప్రాంత ప్రజలతో కలిసి ఆయన విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇర్ఫాన్‌బాషా మాట్లాడుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సబ్‌స్టేషన్ పనులు పదేళ్ల క్రితం మొదలెట్టినప్పుడు స్థానికులు వ్యతిరేకించారన్నారు. మళ్లీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికార బలంతో ఈ సబ్‌స్టేషన్ పనులు ప్రారంభించడం శోచనీయమన్నారు. శ్రీనివాస నగర్‌లోని వీధులు చాలా చిన్నవని తెలిపారు. అందులో నుంచి హైవీ పవర్ లైన్స్ నిర్మిస్తే అక్కడ ఉండే ప్రజలకు చాలా ప్రమాదకరమన్నారు. ఏదైనా జరిగితే బాధ్యత ఎవరు తీసుకుంటారని ఆయన ప్రశ్నించారు. పనులు ఆపకుంటే ప్రభుత్వ కార్యాలయాలు ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ ప్రాంత ప్రజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్టమ్ రోబో రోబోటిక్ టెక్నాలజీస్ ప్రతినిధి గణేష్

కృత్రిమ మేధస్సు ఎంతో ఉపయోగకరం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

విద్యార్థులకు కృత్రిమ మేధస్సు ఎంతో ఉపయోగకరమని బెంగళూరుకు చెందిన స్టమ్ రోబోటిక్స్ టెక్నాలజీస్ ప్రతినిధి గణేష్ పేర్కొన్నారు. సింహాద్రిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం రోబోటిక్స్ అండ్ ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధస్సు) గురించి డెమో ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో వేగంగా డెవలప్ అవుతున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ని విద్యార్థి దశలోనే వారికి అర్థమయ్యేలా చెప్పాలన్నారు. తద్వారా ప్రతి విద్యార్థి ఉన్నతస్థాయికి చేరుకునే అవకాశం ఉందన్నారు. సాఫ్ట్‌వేర్ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. తమ సంస్థ రూపొందించిన సాఫ్ట్‌వేర్ అండ్ హార్డ్‌వేర్ విద్యార్థులకు ఎంతో చక్కగా ఉపయోగకరమన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఉమామహేశ్వరి, ఉపాధ్యాయులు జయ ప్రకాష్‌రెడ్డి, రవీంద్ర, మమత, ప్రతినిధి ప్రవీణ్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ఆధార్ ప్రత్యేక శిబిరాలను మంగళవారం నుంచి నాలుగురోజులపాటు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాముడు ఒక ప్రకటనలో తెలిపారు. బయోమెట్రిక్ అప్డేషన్, డాక్యుమెంట్స్ అప్డేషన్ పెండింగ్ ఉన్నందున ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఏర్పాటు చేశామన్నారు. పులివెందుల పురపాలక సంఘ పరిధిలో నిర్దేశించిన విద్యా సంస్థల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల18,19న జడ్‌పిహెచ్ స్కూల్ (సత్రం), నగరిగుట్ట, అహోబిళపురం హైస్కూల్ మెయిన్, 20,21న ప్రభుత్వ జూనియర్ కాలేజి, జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌లో ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఆధార్ సంబంధిత సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రమాదకరం.. వేగ నిరోధకాలు

ప్రజాశక్తి - ఖాజీపేట

అతివేగాన్ని నిరోధించి ప్రమాదాలను నివారించేందుకు ఏర్పాటు చేసిన వేగ నియంత్రికలు (స్పీడ్ బ్రేకర్స్) వాహనాల పాలిట మృత్యువుగా మారుతున్నాయి. వాహనాల వేగ నియంత్రణ, ప్రమాదాల నివారణ కోసం వేగ నిరోధకాల ఏర్పాటు అవసరం ఉన్నా.. అందుకు తగిన చర్యలు చేపట్టక పోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కడప-కర్నూల్ జాతీయ రహదారి అయ్యప్ప ఆలయ సమీపంలో సర్వీస్ రోడ్డుకు ఇరువైపులా పలుచోట్ల వేగ నిరోధకలు ఏర్పాటు చేశారు. వేగ నిరోధకాలు ఏర్పాటు చేసినట్లు అక్కడ ఎలాంటి సూచికలు లేవు. అక్కడ వేగ నియంత్రికలు ఉన్న విషయం వాహనదారులు గుర్తించడంలేదు. తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. పలువురు గాయపడ్డారు. ఇటీవల మైదుకూరు రోడ్డులోని ఓ కళాశాల వద్ద వేగ నిరోధకాల వల్ల ద్విచక్ర వాహనదారుడు అదుపు తప్పి కింద పడి గాయాల పాలయ్యాడు. ఇలాంటి సంఘటనలు పలుచోట్ల అధికంగా జరుగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వేగ నిరోధకాలు ఉన్న ప్రాంతాల్లో అవి ఉన్నట్లు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.



అయ్యప్ప ఆలయం సమీపంలో సర్వీస్ రోడ్డుపై ఉన్న బ్రేకర్స్

గిట్టుబాటు ధర కల్పించడం మంచి నిర్ణయం



కంది కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి


ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించడం మంచి నిర్ణయమని ఎమ్మెల్యే ఎన్.వరదరాజులరెడ్డి తెలిపారు. ప్రతి వస్తువుకు రేటు ఉంటుందని, రైతుకు మాత్రం ఆయన పండించే పంటకు రేటు ఉండదని, మార్కెట్‌పై ఆధారపడాల్సిందేనని ఎమ్మెల్యే పేర్కొన్నారు. స్థానిక మార్కెట్ యార్డ్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎపి మార్క్‌ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో కంది కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కష్టనష్టాలు అనుభవిస్తూ దేశానికి తిండి అందిస్తున్నారన్నారు. రైతులు బాగా ఆలోచించి నాణ్యమైన ధాన్యాన్ని క్వింటా రూ.7,550తో కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాలన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో ఎఒ శివశంకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ ఎంపిపి నంద్యాల రాఘవరెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షుడు ఇవి సుధాకర్‌రెడ్డి, కెసి కెనాల్ డిస్ట్రిబ్యూటరి వైస్ ఛైర్మన్ ద్వార్శల గురివి రెడ్డి, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు, నాయకులు నంద్యాల భార్గవ్‌రెడ్డి, కాకిరేనిపల్లె లక్ష్మీ నారాయణ రెడ్డి, బిసి నాయకుడు చల్లా రాజగోపాల్ యాదవ్, పాల్గొన్నారు.

పుష్పగిరిలో వీరగల్లుల విగ్రహాల పోలికలు

ప్రజాశక్తి - చాపాడు

వల్లూరు మండలంలో అత్యంత ప్రసిద్ధి చెందిన దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న పుష్పగిరి క్షేత్రంలో రెండు వీరగల్లుల విగ్రహాల పోలికలు భేష్‌గ్గా ఉన్నాయని రచయిత, చరిత్ర పరిశోధకులు బొమ్మిశెట్టి రమేష్ తెలిపారు. ఒక వీరగల్లు విగ్రహం పెన్నా (పినాకిని)నది ఎడమవైపు కొండపైన ఉన్న శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ ప్రాంగణం పక్కగా ఉండగా.. మరో విగ్రహం (నెంబర్ 20)పెన్నా నదికి కుడివైపు ఉన్న పుష్పగిరి గ్రామంలోని శ్రీవైద్యనాథ స్వామి ఆలయంలో ఉందన్నారు. రెండు విగ్రహాల్లో వీరులు గుర్రంపై ఉన్నారన్నారు. ఒక విగ్రహంలోని వీరుడు(రాజు) ఎడమవైపు గుర్రాన్ని పట్టుకొని కుడి చేతిలో అద్భుతమైన, ప్రత్యేకమైన గదను పోలిన ఆయుధాన్ని చేబూని ఉన్నారన్నారు. రాజుకు కుడి వైపు నడుముకు పిడిబాకు(సురిక) ఉండగా, ఒక పెద్ద కత్తి కుడికాలు వైపు ఉన్నట్లుగా శిల్పులు అద్భుతంగా చెక్కారన్నారు. 20వ నెంబర్ విగ్రహంలో వీరుడు ఖడ్గాన్ని ధరించి ఉన్నాడు. రెండు విగ్రహాల్లో వీరులు కొప్పులు ధరించి ఉన్నారన్నారు. ఈ రెండు విగ్రహాల్లో మధ్యన చతురస్రాకార గదిలో మరణించిన వీరుని తీసుకువెళ్తున్న వింజమరులు(రంభ, ఊర్వశి, మేనక) అద్భుతంగా దర్శనమిస్తున్నారని వివరించారు. ఈ విగ్రహంలో చతురస్రాకార గది పార్శ్వ భాగాల్లో త్రిశూల ధ్వజాలు చెక్కబడి ఉండడం విశేషమన్నారు. ఇదే విగ్రహం పై భాగంలో అర్ధచంద్రాకృతి భాగంలో రెండు వైపులా పూర్ణకుంభాలుంటూ అబ్బురపరుస్తోందన్నారు. వీటి సమాచారాన్ని ప్రముఖ స్థపతి, వాస్తు శిల్ప కళా వాచస్పతి శివ నాగిరెడ్డికి తెలుపగా ఆయన ఇవి 14వ శతాబ్దం నాటివని తెలిపారన్నారు.





మట్టి తోలుతున్న లారీలను అడ్డుకున్న రైతులు

మట్టి అక్రమ రవాణాను అడ్డుకున్న రైతులు

ప్రజాశక్తి - వేముల

మండల కేంద్రంలోని పులివెందుల-కడప ప్రధాన రహదారి పక్కన ఉన్న చెరువులో కొన్ని రోజుల నుంచి గ్రీన్‌ఫీల్డ్ హైవే వారు అక్రమంగా మట్టి రవాణా చేస్తున్నారు. దీనిపై సోమవారం సాయంత్రం రైతులు పెద్ద ఎత్తున అక్కడికి వెళ్లి అడ్డుకున్నారు. రైతులు మట్టి రవాణా చేయకుండా అడ్డుకోవడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఇష్టానుసారం మట్టిని తవ్వి తోలుకోవడం వల్ల తమ బోరుబావుల్లో నీరు తొందరగా తగ్గిపోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూముల నుంచి మట్టి తవ్వుకొని రవాణా చేసుకోమని రైతులు సూచించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అనుమతులు లేకుండా మట్టి రవాణా చేయడానికి వీలు లేదని, మట్టి తవ్వకాలను ఆపేశారు.



బహిరంగ వేలం నిర్వహిస్తున్న దేవస్థాన అధికారులు

తలనీలాల టెండర్లు వాయిదా

ప్రజాశక్తి - చక్రాయపేట

మండలంలోని గండి క్షేత్రంలో తలనీలాలు, కొబ్బరి చిప్పలు నిర్వహణకు సోమవారం రెండవసారి బహిరంగ వేలం వాయిదా పడింది. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ జె వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో తలనీలాలు పోగు చేసుకొనుటకు ఒక్కరు డిపాజిట్ రూ.25 లక్షలుతో పాల్గొన్నారు. భక్తులు కొట్టిన కొబ్బరి చిప్పలు పోగు చేసుకొనుటకు డిపాజిట్ ఒకొక్కరు రూ.3 లక్షలతో ముగ్గురు పాల్గొన్నారు. డిపాజిట్ కట్టిన వారు పాట పాడేందుకు ముందుకు రాకపోవడంతో వేలం నిలిపేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. మళ్లీ వేలంపాట ఎప్పుడు నిర్వహించేంది ప్రకటనలో తెలుపుతామన్నారు. కార్యక్రమంలో దేవస్థాన ఛైర్మన్ కావలి కృష్ణతేజ, మాజీ ఛైర్మన్ కల్లూరు వెంకటస్వామి, దేవస్థాన ఉప ప్రధాన అర్చకులు రాజా రమేష్, ఎపిజిబి చక్రాయపేట సిబ్బంది, కడప దేవాదాయ శాఖ తనిఖీదారులు శివయ్య, ఆర్కేవ్యాలి పోలీసులు పాల్గొన్నారు.



పైప్‌లైన్ పనుల ప్రారంభంలో భూపేష్‌రెడ్డి, నాయకులు

పట్టణ అభివృద్ధికి కృషి : భూపేష్‌రెడ్డి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎర్రగుంట్ల అభివృద్ధికి కృషి చేస్తానని జమ్మలమడుగు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలో సోమవారం ఆయన పలు పనుల ప్రారంభంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ డిఎంఎఫ్, ఎస్ఎఫ్సి, 15ఎఫ్సి గ్రాంట్ కింద పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరైనట్లు తెలిపారు. వినాయక నగర్, ఏరువాక గంగమ్మ దేవాలయం వీధిలో పైప్‌లైన్ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శేషపణి, నాయకులు కత్తి ప్రతాపరెడ్డి, బయపురెడ్డి, సంజీవరెడ్డి, కె. శీను, రమేష్‌రెడ్డి, వలి, రెండో వార్డు వైసిపి నాయకులు వజ్రా డేవిడ్ పాల్గొన్నారు.

దెబ్బతిన్న కల్వర్టును పూడ్చేదెన్నడో..!

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని చిన్న వరదయ్యపల్లి నుంచి మైదుకూరు-ప్రొద్దుటూరు ప్రధాన రహదారికి వచ్చే మార్గంలో కెసి కాలువ గట్టుపై కల్వర్టు దెబ్బతింది. ఆ దారిన రావాలంటే ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చాపాడు చానల్ కాలువ వెంబడి ఉన్న ఈ దారి వెంట గ్రామ ప్రజలతోపాటు మడూరు, చెంచుపల్లె గ్రామస్తులు ఈ మర్గాన ప్రయాణిస్తుంటారు. పశువులు అధికంగా ఈ మార్గాన సంచరిస్తుంటాయి. కల్వర్టు దెబ్బ తినడంతో ప్రజలు, పశువులు ప్రమాదాలబారిన పడుతున్నారు. అధికారులు స్పందించి దెబ్బతిన్న కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలని, సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



చిన్నవరదాయపల్లె వద్ద దెబ్బతిన్న కల్వర్టు

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి

- నేటి నుంచి గ్రామాల్లో సదస్సులు : తహశీల్దార్

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణంతోపాటు మండలంలోని 17 గ్రామాల్లో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి నేటి నుంచి సదస్సులు నిర్వహించనున్నట్లు తహశీల్దారు శోభన్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. టూర్ డైరీ ఆఫ్ తహశీల్దార్ కార్యక్రమం ద్వారా 22 రోజులపాటు ఉదయం వేళల్లో ప్రతి గ్రామంలో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. భూమి, రెవెన్యూ రసీదులు, పట్టా పుస్తకాలను తనిఖీ చేస్తామని తెలిపారు. ఆక్రమణల తొలగింపుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి, యువజన, ప్రజా సంఘాల నాయకులు

అమృత్ నగర్ దళారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

అమృత్ నగర్ ఇంటి నిర్మాణాలను నిలుపుదల చేస్తూ డబ్బులు డిమాండ్ చేస్తున్న దళారులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి యువజన, ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. రెవెన్యూ కార్యాలయం వద్ద సోమవారం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహశీల్దార్ గంగయ్యకు వినతిపత్రం అందజేశారు. సమస్యను తహశీల్దార్ గంగయ్య దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా, వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే చొరవచూపి ఇలాంటి వ్యక్తులపై విచారణ జరిపి కేసులు నమోదు చేసేందుకు ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి, యువజన, ప్రజా సంఘాల నాయకులు ములపాకు ప్రతాప్‌రెడ్డి, బహుజన సమాజ్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తిట్ల రవి, కమ్యూనిస్టు నాయకుడు ప్రతాప్, విద్యార్థి యువజన నాయకులు ఓబులేష్ కత్తి, డివైఎఫ్ఐ నాయకుడు డేవిడ్ రాజ్, బయన్న, బెనర్జీ, దాసు, ఈశ్వరయ్య, అమృత నగర్ బాధితులు జయమ్మ, మల్లీశ్వరి, సుగుణ, చంద్రకళ, ఎలిసమ్మ పాల్గొన్నారు.



రథాన్ని లాగేందుకు పోటీపడుతున్న భక్తులు

వైభవం.. శ్రీరంగనాథ స్వామి రథోత్సవం

- ఆకట్టుకున్న వేషధారణలు, చెక్కభజనలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలో వెలసిన శ్రీ రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి రథోత్సవం వైభవంగా సాగింది. ఆలయ ఛైర్మన్ సుధాకర్‌రెడ్డి, ఇఒ రమణ ఆధ్వర్యంలో ఉదయం 9గంటల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉభయ దారులకు పూజలు నిర్వహించి, సన్మానం చేశారు. పట్టణ పుర వీధుల నుండి రథోత్సవం కొనసాగింది. రథాన్ని లాగేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రథోత్సవం ముంగిట చెక్కభజన, పలు వేషధారణలు ఆకట్టుకున్నాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా డిఎస్‌పి మురళీ నాయక్, అర్బన్ సిఐ నరసింహులు, ఎస్ఐ నారాయణ, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను పరిశీలిస్తున్న వైద్యాధికారి కుమార్

రసాయన రహిత ఉత్పత్తులు ఆరోగ్యానికి మేలు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఆహార ఉత్పత్తులను తినడం ద్వారా 90 శాతం అనారోగ్య సమస్యలు తీరిపోతాయని పిహెచ్‌సి డాక్టర్ కుమార్ పేర్కొన్నారు. సింహాద్రిపురం ఆరోగ్య కేంద్రం వద్ద సోమవారం నిర్వహించిన ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించిన కూరగాయలు, ఆకుకూరలు, దుంప జాతి, ఇతర పండ్ల రకాలతో విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన రహిత ఉత్పత్తులను తినడం ఆరోగ్యానికి ఎంతో మంచిదన్నారు. ప్రకృతి వ్యవసాయం మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్ రవీంద్ర గౌడ్, డివిజనల్ మాస్టర్ ట్రైనర్ నాగ సుబ్బరాయుడు మాట్లాడుతూ వీటిని తక్కువ ధరలకే తమ సిబ్బంది ద్వారా విక్రయిస్తున్నామన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో మోడల్ మేకర్ ఐవి రమణ, పిఆర్పీలు శ్రీనివాసులు, రిబికా, జయమ్మ, ఆరోగ్య పర్యవేక్షకులు జయప్రకాష్, విజయలక్ష్మీ, ఎఎన్ఎంలు, ఐసీఆర్పీలు పాల్గొన్నారు.

బిసి కార్పొరేషన్ రుణాలకు రేపు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలానికి కేటాయించిన బిసి కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కృష్ణమూర్తి తెలిపారు. అన్ని బ్యాంకుల ప్రతినిధుల సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు దరఖాస్తుదారులు అప్లికేషన్ ఒరిజినల్, అన్ని విద్యా సంబంధ సర్టిఫికెట్లు, బ్యాంక్ పాసుబుక్ జిరాక్స్, ఆధార్ కార్డు రెండు సెట్లు తీసుకొని రావాల్సి ఉంటుంది సూచించారు. **చాపాడు :** బిసి, కాపు, తెలగ ఒంటరి, ఇబిసి, రెడ్డి, ఆరవైశ్య కార్పొరేషన్‌కు సంబంధించి దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థులకు బుధవారము ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ వీర కిషోర్ తెలిపారు. ఎంపిడిఒ కార్యాలయంలో బ్యాంకు మేనేజర్ల సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. బుధవారం ఉదయం వెదురూరు, చియ్యపాడు, పల్లవోలు, మడూరు గ్రామాల దరఖాస్తుదారులకు, మధ్యాహ్నం చాపాడు, అల్లాడుపల్లె, బద్రిపల్లె, లక్ష్మీపేట, చిన్న గురువలూరు, పెద్దగురువలూరు, ఎన్.ఓబాయపల్లె, కుచ్చుపాప, సోమాపురం, సిద్దారెడ్డిపల్లె గ్రామాల వారికి ఇంటర్వ్యూ నిర్వహి స్తామన్నారు. **మైదుకూరులో..** బిసి రుణాలకు సంబంధించి ఇంటర్వ్యూలను బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు తెలిపారు. ఉదయం ఆదిరెడ్డిపల్లె, వనిపెంట, విశ్వనాధపురం, నంద్యాలంపేట, అన్నలూరు, శివపురం, పప్పనపల్లె గ్రామాల దరఖాస్తుదారులకు, మధ్యాహ్నం గంజికుంట, తిప్పిరెడ్డిపల్లి, మిట్టమానుపల్లి, తువ్వపల్లి, ఎన్.యర్రబల్లి, డాంఖాన్‌పల్లె, పప్పనపల్లి గ్రామాల వారికి ఇంటర్వ్యూ నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప - తాడిపత్రి జాతీయ రహదారిపై గొల్లపల్లి గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. మృతుడు దేవుని కడపకు చెందిన కంబాల సుబ్బయ్యగా పోలీసులు గుర్తించారు. సుబ్బయ్య తాడిపత్రిలోని ఓ ప్రయివేట్ ఇంజినీరింగ్ కళాశాలలో అధ్యాపకుడిగా పని చేస్తున్నాడు. అతనికి భార్య, ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. విధుల నిమిత్తం ద్విచక్ర వాహనంలో వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. కమలాపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన సుబ్బయ్య